# భీమదేవరపల్లి మండలంలో ఔషధ దుకాణాల స్వచ్ఛంద బంద్



**భీమదేవరపల్లి/మే20 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో బుధవారం ఔషధ దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించాయి. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్స్ ఇచ్చిన 24 గంటల దేశవ్యాప్త బంద్ పిలుపుకు మద్దతుగా మండలంలోని మెడికల్ షాపులను మూసివేసినట్లు భీమదేవరపల్లి మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న కెమిస్టులు ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ఫార్మసీల ప్రభావం, మారుతున్న ప్రభుత్వ నిబంధనలు, పెరుగుతున్న వ్యాపార పోటీ కారణంగా చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చిన్న కెమిస్టుల హక్కులను పరిరక్షించేందుకు మరియు వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ బంద్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ బంద్‌కు మండలంలోని ఔషధ వ్యాపారులు సంఘీభావం ప్రకటించి దుకాణాలను మూసివేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముల్కనూర్‌లోని ప్రైవేట్ సుధాకర్ హాస్పిటల్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో బొజ్జపూరి మురళి, మామిడాల రవీందర్, ఉడుత శ్రీనాథ్, వనరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలి

### తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ



**తల్లాడ/మే 20 (జర్నలిస్ట్ వార్త):** రానున్న బక్రీద్ పండుగను మండల ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకోవాలని తల్లాడ ఎస్సై పి. వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదీన బక్రీద్ పండుగ ఉన్న నేపథ్యంలో. బుధవారం తల్లాడ పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో ఆయన ప్రత్యేక పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ హిందూ-ముస్లిం భాయి భాయి అనే నినాదానికి ప్రతీకగా, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణాన్ని కాపాడటంలో మత పెద్దలు, యువత పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండలంలోని ఉభయ వర్గాల మత పెద్దలు, ప్రముఖులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

### - విద్యాశాఖ అధికారుల తీరుపై ప్రజాసంఘాల ఆగ్రహం



**వర్ధన్నపేట/మే 20 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్డూఅదుపూ లేకుండా సాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే సమగ్ర చట్టాన్ని రూపొందించి, పకడ్బందీగా అమలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేటలో రివల్యూషనరీ సోషలిస్టు వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కో-కన్వీనర్ జంగిలి భాస్కర్ విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని రకరకాల పేర్లతో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను పూర్తి వ్యాపారంగా మార్చేశారని వారు మండిపడ్డారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు తమకున్న కొద్దిపాటి ఆస్తులను అమ్ముకుంటూ ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా అదనపు సెక్షన్లు, బ్రాంచ్‌లను నడుపుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, పైగా వారి దోపిడీకి కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రైవేట్ సంస్థల ఫీజుల నియంత్రణకు కఠినమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - టీడీపీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు సూచన



**తల్లాడ/మే 20 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో భానుడి భగభగలు, తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు సూచించారు. బుధవారం ఆయన తల్లాడలో విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు సత్తుపల్లి నియోజకవర్గంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వృద్ధులు, గర్భిణులు, వికలాంగులు, చిన్న పిల్లలు మధ్యాహ్నం వేళల్లో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు చేయకుండా ఇళ్లలోనే ఉండటం సురక్షితమన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ చల్లటి నీరు, మజ్జిగ ఎక్కువగా తాగాలని పిలుపునిచ్చారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సంచార వైద్య శాలల్లో ఓఆర్ఎస్ (రా=రా) ప్యాకెట్లను తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, నిరంతర విద్యుత్ సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు.

# కొప్పూర్ గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ విరాళం


### దాతలు ప్రదీప్, ప్రణయ్‌లకు సన్మానం



**భీమదేవరపల్లి/మే20 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో మానవీయ విలువలను ప్రతిబింబించే సేవా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొమ్ముల సుగుణ వీరస్వామి జ్ఞాపకార్థం దాతలు ప్రదీప్, ప్రణయ్ గ్రామ ప్రజల అవసరార్థం ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. గ్రామ ప్రజలకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఈ సేవా కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో మృతదేహాలను భద్రపరచేందుకు సరైన సదుపాయాలు లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసినట్లు దాతలు తెలిపారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే సేవ చేయడం అభినందనీయమని గ్రామ పెద్దలు కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కొప్పూర్ గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉప సర్పంచ్ మిరియాల రాణి రాజు, గ్రామ కార్యదర్శి రత్నకుమారి, మాజీ సర్పంచ్‌లు కొమ్ముల రమేష్, కొత్తకొండ భాగ్యలక్ష్మి రాజమొగిలి, కొయ్యడ జనార్ధన్, గద్ద రాజమణి సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు గడిపె బిక్షపతి, కొత్తకొండ లలిత నాగరాజు, గద్ద రజిత సంపత్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మండల సురేందర్, గట్ల నర్సింగాపూర్ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రచ్చ సంపత్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మంద సమ్మయ్య, ఎంసీఆర్‌బీ కొప్పూర్ డైరెక్టర్ మంద శ్రీనివాస్, పురుషుల పొదుపు సంఘం గ్రామ అధ్యక్షులు గద్ద మురళి, గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సమాజానికి అవసరమైన సమయంలో తోడ్పడే ఇలాంటి సేవలు నిజమైన మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండటం ఇతరులకు ఆదర్శమని అన్నారు. అనంతరం దాతలు ప్రదీప్, ప్రణయ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

### చెన్నారావుపేట జంట హత్య కేసు

# నిందితుడికి ఉరిశిక్ష విధించిన వరంగల్ కోర్టు



**నర్సంపేట/ మే 20 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల 16చింతల్ తాండాలో సంచలనం సృష్టించిన దారుణ జంట హత్యల కేసులో వరంగల్ ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి జె. మైత్రేయి చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. భార్యాభర్తలను అత్యంత క్రూరంగా హతమార్చడమే కాకుండా, మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీకి కోర్టు ఉరిశిక్ష ఖరారు చేసింది.

గూడూరు మండలం గుండెంగా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు.ఎస్టీ లంబాడి వర్గానికి చెందిన బానోత్ సుగుణ (45), ఆమె భర్త బానోత్ శ్రీను (50)లను దారుణంగా హత్య చేశాడు. ఈ దాడిలో బానోత్ దీపిక (21), బానోత్ మదన్ లాల్ (17) తీవ్ర గాయాలతో బయటపడ్డారు. బాధితురాలు బానోత్ ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఈ కేసును తొలుత వరంగల్ ఎస్బీ సీఐ చంద్రమోహన్, ఆ తర్వాత నెక్కొండ సర్కిల్ సీఐ శ్రీనివాస్ క్షుణ్ణంగా దర్యాప్తు చేశారు. ప్రస్తుతం చెన్నారావుపేట ఎస్హెచ్ఓగా రాజేష్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. నిందితుడిపై బీఎన్ఎస్ (BNS) సెక్షన్లు 103(1), 333, 109, 351(3)తో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 25(1ఎ) కింద కేసులు నమోదయ్యాయి.

కోర్టులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి స్పందిస్తూ బీఎన్ఎస్ సెక్షన్ 103(1) ప్రకారం నిందితుడు దోషిగా తేలాడని, బీఎన్ఎస్ఎస్ (BNSS) సెక్షన్ 238(2) ప్రకారం "మెడకు ఉరి వేసి మరణించే వరకు శిక్షను అమలు చేయాలని ఆదేశించారు. దీంతో పాటు రూ.5 వేల జరిమానా కూడా విధించారు. ఈ కేసులో ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి బృందా దేవి బాధితుల తరపున బలమైన సాక్ష్యాధారాలతో సమర్థవంతమైన వాదనలు వినిపించి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేశారు.

# అర్హులైన ఆడబిడ్డలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### - టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు





**కొత్తగూడెం/ మే 20 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని అర్హులైన ఆడబిడ్డలందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి తీరుతామని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు స్పష్టం చేశారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హమాలీ కాలనీలో దేవి-గబ్బర్ సింగ్ దంపతులు ప్రభుత్వ ఆర్థిక సాయంతో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాల్లో ఇందిరమ్మ ఇళ్లు కీలకమైనవన్నారు. సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలోనూ కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు భారీగా ఇళ్లు వచ్చాయని, కానీ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలను ఇళ్లు ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఓబీసీ అనుబంధ సంఘాల నాయకులు జయప్రకాష్, బొబ్బాల వెంకట్ యాదవ్, దయ్యాల సమ్మయ్య, వీరయ్య, కిరణ్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంత చెప్పినా వినరా?

### - పంట వ్యర్థాల దహనంతో ముప్పు -నిపుణుల హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న రైతులు





**ఎల్కతుర్తి/మే20 (జర్నలిస్ట్ వార్త):** వ్యవసాయ బావుల వద్ద పంట అవశేషాలను తగలబెట్టవద్దని అధికారులు, నిపుణులు ఎంతగా మొత్తుకుంటున్నా రైతులు మాత్రం తమ వైఖరి మార్చుకోవడం లేదు. ఇటీవల వ్యవసాయ శాఖ అధికారి మంద రాజ్‌కుమార్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మీడియా ద్వారా అవగాహన కల్పించినా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా మండలంలోని చింతలపల్లిలో ఓ రైతు తన పొలంలో పంట వ్యర్థాలను నిప్పుపెట్టి తగలబెడుతూ కనిపించడం ఇందుకు నిదర్శనం.

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ వంటి ప్రమాదకర వాయువులు విడుదలై గాలి కలుషితమవుతుందని, ఇది ప్రజలు, రైతుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలో రసాయనాల భారం పెరిగి, కాలక్రమేణా దిగుబడి తగ్గిపోతుందని వాపోతున్నారు. ఈ వ్యర్థాలను తగలబెట్టడానికి బదులు.కంపోస్ట్‌గా మార్చడం లేదా మల్చింగ్ పద్ధతులను అవలంబిస్తే భూమిలో తేమ శాతం పెరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు. రైతులు ఈ మెలకువలు పాటిస్తే రసాయన ఎరువుల ఖర్చు తగ్గి, అధిక దిగుబడులు సాధించవచ్చని, ఇప్పటికైనా రైతులు తమ మొండివైఖరి వీడాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

